సాక్షి
శ్రీకాకుళం

సోమవారం, 22, సెప్టెంబర్, 2025



వీడని గ్రహణం

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పట్టిన గ్రహణం వీడడం లేదు. ఈ భవనాలను పట్టించుకోవడం లేదు.

- IIలో



బైక్‌ను ఢీకొట్టి..

దేవాది కూడలి వద్ద బైక్ లారీ కిందకు దూసుకెళ్లింది. ముగ్గురు గాయపడ్డారు.

- IIలో



తుప్పు పట్టిన యంత్రాలు

ఎచ్చెర్ల: మండలంలోని నిర్మిత కేంద్ర కోసం ఏర్పాటుచేసిన యంత్రాలు తుప్పు పట్టి అధ్వానంగా మారాయి. ఇక్కడ యంత్రాలు పాడై చాలా కాలం గడుస్తున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో యంత్రాల పరిస్థితి ఇలా మారింది.

న్యూస్‌రీల్

రైలు నుంచి దిగిపోయిన చిన్నారి



తప్పిపోయిన బాలుడు

శ్రీకాకుళం అర్బన్: పలాస రైల్వేస్టేషన్‌లో తల్లిదండ్రులు, బంధువులు లేకుండా తిరుగుతున్న ఓ చిన్నారిని రైల్వే అధికారులు గుర్తించి శ్రీకాకుళంలోని అరసవల్లిలోగల శిశుగృహానికి తరలించారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ నుంచి పలాస రైల్వేస్టేషన్‌లో ఒక బాలుడు (వయసు సుమారు 3 సంవత్సరాలు) ఒంటరిగా దిగిపోయాడు. ఈ విషయాన్ని ప్రయాణికులు 139 నంబరు ద్వారా సమాచారం ఇవ్వగా, అక్కడే ఉన్న ఆర్పీఎఫ్ సిబ్బంది బాలుడిని చైల్డ్ హెల్ప్‌లైన్‌కి అప్పగించారు. ఆ చిన్నారి తల్లిదండ్రుల గురించి విచారించినా ఎవరూ ముందుకు రాలేదు. తప్పిపోయిన బాలుడికి ఏం అడుగుతున్నా చెప్పలేకపోవడంతో ఆ బాలుని వివరాలు అందుబాటులోకి రాలేదు. అనంతరం బాలల సంక్షేమ సమితి ఆదేశాల మేరకు చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ఆ చిన్నారిని శ్రీకాకుళంలోని అరసవల్లి శిశుగృహలో చేర్పించారు. బాలుడికి సంబంధించి తల్లిదండ్రులు లేదా బంధువులు ఎవరైనా ఉంటే వెంటనే మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, శ్రీకాకుళంను సంప్రదించాలని అధికారులు కోరారు.

ఉద్దానం పథకం పైప్‌లైన్ లీక్



వృథాగా పోతున్న ఉద్దానం పథకం నీరు

కంచిలి: ఉద్దానం పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న నీరు నిత్యం ఏదోచోట వృథా అవుతూనే ఉంది. కంచిలి పంచాయతీ పరిధి మఠం కంచిలి నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఉన్న పైప్‌లైన్ రెండు రోజుల నుంచి లీక్ అవుతోంది. శనివారం పెద్ద ఎత్తున నీరు లీక్ కావడంతో స్థానికులు ఫిర్యాదు చేయడంతో, పైన వాల్వ్ బంద్ చేశారు. మళ్లీ ఆదివారం నీరు విడిచిపెట్టడంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అదే భాగంలో నీరు పెద్ద ఎత్తున వృథా అవుతూ కన్పించింది. దీంతో మళ్లీ పంచాయతీ కార్యదర్శి ఎన్ని రాంబాబు దృష్టికి తీసుకెళ్లడంతో, ఆయన ఉద్దానం నీటి పథకం అధికారులకు తెలియజేయడంతో, మళ్లీ వాల్వ్ బంద్ చేశారు. మరమ్మతులు చేయకుండా నేరుగా వాల్వ్ బంద్ చేసి, నీటి సరఫరాను ఆపేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ తదితరులు



ప్రొటోకాల్ రగడ

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు అవమానంపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తీవ్ర చర్చ
- పాలకొండ ఎంపీడీఓపై చర్యలు తీసుకున్నాకే సమావేశమంటూ ప్రకటించిన జెడ్పీ చైర్‌పర్సన్ విజయ
- ఎమ్మెల్సీకి మద్దతుగా సభ్యుల వాకౌట్
- జెడ్పీ సీఈఓ పాత్రపై కూడా విచారణ జరిపించాలన్న ఎమ్మెల్సీ విక్రాంత్

అరసవల్లి:

జిల్లా పరిషత్ చరిత్రలో తొలిసారిగా సర్వసభ్య సమావేశంలో అధ్యక్షురాలితో సహా సభ్యులంతా వాకౌట్ చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వైఎస్సార్ సీపీకి చెందిన శాసన మండలి సభ్యుడు పాలవలస విక్రాంత్‌ను ఇటీవల పాలకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాకుండా నిలువరించడమే కాకుండా భౌతిక దాడికి సైతం పాల్పడిన సంగతి విదితమే. దీనిపై ఆదివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. ఈ నెల 16న పాలకొండలో జరిగిన ఈ ఘటనకు బాధ్యుడైన పాలకొండ ఎంపీడీఓపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తిరిగి జెడ్పీటీసీ సభ్యులపై అమానుషంగా ఏకవచనంతో మాట్లాడిన జెడ్పీ సీఈఓ ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజాపై విచారణకు ఆదేశించాలని సభ్యులంతా పట్టుపట్టడంతో సభ హీటెక్కింది. అనంతరం సీఈఓ తీరును నిరసిస్తూ సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓపై ధ్వజం

ఎమ్మెల్సీ విక్రాంత్‌కు జరిగిన అవమానంపై జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు స్పందిస్తూ ఘటన జరిగి ఐదు రోజులవుతున్నా ఎంపీడీఓపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా బదులిస్తూ కమిషనర్‌కు నివేదించానని, తదనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో 'నేను చెప్పింది విను ముందు' అనడం సభ్యులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్‌ను ఏకవచనంతో పిలవడమేంటని పోడియంను చుట్టుముట్టారు. జెడ్పీ చైర్ పర్సన్ కూడా జత కలిశారు. పాలకొండ ఎంపీడీఓపై చర్యలు తీసుకునేంత వరకు సభ జరగదని అంతా వాకౌట్ చేశారు. సభలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, హిరమండలం టీడీపీ జెడ్పీటీసీ బుచ్చిబాబు, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్‌లు మాత్రమే కూర్చుండిపోయారు. అనంతరం సభ వాయిదా పడిందని జెడ్పీ సీఈఓ ప్రకటించారు.

సభలో ఆందోళన

- టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్న చట్టసభ్యులందరికీ గౌరవంగా ప్రొటోకాల్ పాటించామని గుర్తుచేశారు. గతంలో ఆహ్వానాలు పంపినా అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు ఏనాడూ రాలేదన్నారు.
- వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ మాట్లాడుతూ ఎమ్మెల్సీకి సమావేశానికి ఆహ్వానించి మళ్లీ వెనక్కి తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు.
- ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి మాట్లాడుతూ చట్టసభ్యులనే లోపలికి రానివ్వని సంస్కృతి దారుణమన్నారు.
- జి.సిగడాం జెడ్పీటీసీ కాయల వెంకట రమణ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు.
- రాజాం జెడ్పీటీసీ నర్సింహులు, బూర్జ జెడ్పీటీసీ రామారావు, రణస్థలం జెడ్పీటీసీ టి.సీతారాం, వీరఘట్టం జెడ్పీటీసీ జె.కన్నతల్లి, సీతంపేట జెడ్పీటీసీ ఆదినారాయణ, సంతబొమ్మాళి జెడ్పీటీసీ వసంత్‌రెడ్డి మాట్లాడుతూ విక్రాంత్‌కు జరిగిన అవమానం తట్టుకోలేకపోతున్నామన్నారు.



జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా వైఖరిపై మండిపడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు

ప్రొటోకాల్ పాటించాలి..



జిల్లాలో అన్ని శాఖల అధికారులు స్థానిక సంస్థల ప్రతినిధులకు ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలి. ప్రొటోకాల్ పాటించాలి. ఈ విషయంలో అనుమానాలు ఉంటే జిల్లా రెవెన్యూ అధికారిని సంప్రదించాలి. ఇచ్ఛాపురం ప్రొటోకాల్ ఉల్లంఘన నా దృష్టికి వచ్చింది. ఇలాంటివి మళ్లీ జరగకూడదు. పాలకొండ అంశంపై జెడ్పీ సీఈఓ విచారణ జరపాలి. – స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

నన్ను దారుణంగా అవమానించారు



ఈ నెల 16న పాలకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆహ్వానం మేరకే వెళ్లాను. కానీ నన్ను లోపలకు వెళ్లనివ్వలేదు. నాకు ఆప్షనల్ నియోజకవర్గమైన పాలకొండలో మండల సమావేశానికి రా కుండా ముఖ ద్వారం వద్దనే ఆపేశారు. డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు భౌతికంగా తోసేశారు. నన్ను దా రుణంగా అవమానపరిచారు. ఆహ్వానం పంపిన ఎంపీడీఓను వివరణ అడిగితే 'అవగాహన లేక పని ఒత్తిడిలో చూసుకోక ఆహ్వానం పంపించాం.. ఆహ్వానాన్ని వెనక్కి తీసుకుంటున్నామంటూ.' లేఖలో సమాధానం ఇచ్చారు. ఒక ఎమ్మెల్సీగా నాకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే జెడ్పీటీసీలు, ఎంపీపీల పరిస్థితి ఏంటి. ఘటన జరిగి ఐదు రోజులవుతున్నా పాలకొండ ఎంపీడీఓపై ఎందుకు చర్య లు తీసుకోలేదు. జెడ్పీ సీఈఓపైనా విచారణ జరగాలి.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

నన్నే చాలాసార్లు పిలవలేదు



చట్ట సభ్యులను కూడా అవమానించడం దారుణం. ఇటీవల ఇచ్ఛాపురంలో జిల్లా పరిషత్ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ పథకాల ప్రారంభోత్సవానికి నాకు కనీసం సమాచారమైనా ఇవ్వలేదు. దీనిపై ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. నాకు కాకపోయినా ఈ చైర్‌కు అయినా విలువ ఇవ్వాలి కదా. – పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

పేదింటి పట్టాపై కూటమి కన్ను



- వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు తిరిగి తీసుకునేందుకు కుయుక్తులు
- వాటిని కొత్తగా కూటమి నాయకులకు ఇచ్చే ప్రయత్నం
- జిల్లాలో దాదాపు 2867 మంది లబ్ధిదారులకు నష్టం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదవాడి ఇంటి పట్టాపై కూటమి కన్ను పడింది. ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర దాటిపోయినా ఒక్క ఇంటినైనా మంజూరు చేయని ప్రభుత్వం.. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు తీసుకోవడానికి ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు పేదల ఇళ్లపై ఓ నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం నుంచి ఇంటి పట్టా తీసుకుని, నిధులు మంజూరై నిర్మాణం ప్రారంభించకపోతే ఆ ఇల్లు రద్దు చేయాలని, ఆ పట్టాను కొత్తవారికి ఇవ్వాలని ఆదేశించారు. ఈ నిర్ణయం రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు నష్టం చేకూర్చనుండగా.. కూటమి నాయకులకు మాత్రం లాభం తీసుకురానుంది. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం ప్రారంభం కాకపోతే వారికి ఆర్థికంగా సాయం చేసి ఇంటిని పూర్తి చేసే బాధ్యతను తీసుకోవాల్సిన ప్రభుత్వం.. ఏకంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన పట్టాలను వెనక్కి లాక్కోవాలనుకోవడంపై సామాన్యులు మండిపడుతున్నారు. ఇప్పటికే కొంతమంది లబ్ధిదారులు సొంతంగా ఇల్లు కట్టుకునే ప్రయత్నం చేస్తుంటే వారికి నిధులు మంజూరు చేయకుండా అడ్డుపడుతున్న ప్రభుత్వం మరో అడుగు ముందుకువేసి పట్టాలను రద్దు చేయడం దుస్సాహసమేనని అంటున్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో..

గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వలంటీర్ల ద్వారా ఇంటింటా సర్వేలు నిర్వహించి, అర్హత గల ప్రతి ఒక్క కుటుంబానికి ఇల్లు మంజూరు చేశారు. స్థలం ఉన్న వారికి వారి స్థలంలో ఇంటి నిర్మాణం చేసేందుకు సాయం చేశారు. సొంత స్థలం లేని పేదలకు ప్రభుత్వమే భూమి కొనుగోలు చేసి, వారికి పట్టాలను అందజేశారు. ఇళ్ల నిర్మాణాలు కూడా గత ప్రభుత్వమే చేపట్టింది. గత ప్రభుత్వం హయాంలో జిల్లాలో 30 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో మొత్తం 80,691 ఇళ్లను మంజూరు చేసింది. ఇందుకు గాను 834 లే అవుట్లను ఏర్పాటు చేసింది. ఆ లే అవుట్లలో విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించారు. స్థలమిచ్చి జిల్లాలో 33,123 ఇళ్లను మంజూరు చేసి వారికి శాశ్వత చిరునామా ఇచ్చారు. వారిలో చాలామంది ఇళ్ల ప్రవేశాలు కూడా పూర్తి చేశారు. కొందరు మాత్రం ఇళ్లను ప్రారంభించుకోలేకపోయారు. ఇలాంటి వారు జిల్లాలో 2867 మంది ఉన్నారు. ఇప్పుడు వీరి పట్టాలు ప్రమాదంలో పడ్డాయి.

కన్నీటి ఎత్తిపోతలు

- నెలల తరబడి జీతాలకు నోచుకోని ఎత్తిపోతల ఇంజినీర్లు
- స్థాయిని బట్టి వేతనాల చెల్లింపులో జాప్యం
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు తప్పని తిప్పలు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. ఎత్తిపోతల నీటిపారుదల పథకం ఇంజినీర్లకు, సిబ్బందికి నెలల తరబడి వేతనాలు అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ శాఖలో ఇంజినీర్ల స్థాయిని బట్టి ఈఈ, డీఈలకు సుమారు 9నెలలకు పైగా, ఏఈ, జేఈ, అటెండర్, కంప్యూటర్ ఆపరేటర్లకు మార్చి నెల నుంచి ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదు. కేవలం వర్షాలపై ఆధారపడి పంటలు పండించే ప్రాంతంలోని వారికి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందజేస్తారు. వీరు పనిచేస్తేనే రైతులు పంట పండించగలరు. రైతులు జీవితాల్లో వెలుగులు నింపే ఇంజినీర్ల బతుకుల్లో మాత్రం జీతాలు రాక చీకట్లు కమ్ముకుంటున్నాయి. దాదాపుగా ఏడాది కాలంగా జీతాల్లేక విధులు నిర్వహిస్తున్నారంటే వీరి సహనాన్ని కూటమి ప్రభుత్వం పరీక్షిస్తున్నట్లే. కుటుంబాలు ఎక్కడ రోడ్డున పడిపోతాయోనని భయంతో ఇప్పటి వరకు రోడ్డెక్కకుండా అలా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లిస్తే అప్పులు తీర్చగలుగుతామని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు పాతవి, కొత్తవి 50కి పైగా ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించే, బాధ్యత ఇక్కడ పనిచేస్తున్న ఇంజినీర్లదే. ఎత్తిపోతల నీటిపారుదల పథకం శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒకరు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒకరు రెగ్యులర్ ప్రాతిపదికన ఉన్నారు. ఏఈలు ఒకరు, జేఈ ఒకరు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు ఇద్దరు, అటెండర్స్ ఇద్దరు, వాచ్‌మెన్ ఒకరు పనిచేస్తున్నారు. వీరంతా గత ఏడాది కాలంగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాలకొండ ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

అరసవల్లి: పాలకొండలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు జరిగిన ప్రొటోకాల్ ఉల్లంఘన, అవమానం దారుణమని ఇందుకు బాధ్యుడైన పాలకొండ ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం బయట విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఎక్కడా విలువ ఇవ్వడం లేదని, గ్రామంలో సర్పంచ్‌కు తెలియకుండా, మండలాల్లో ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సమాచారం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. ఇందుకు నిరసనగా ఆదివారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సభ్యులందరి మద్దతుతో వాకౌట్ చేశామన్నారు. గ్రామాల్లో రైతులకు ఈ ప్రభుత్వం యూరియా కష్టాలను తెచ్చిపెట్టిందని, ఎక్కడ చూసినా లైన్లలో రైతులు కష్టాలు పడుతుంటే గ్రామాల్లో టీడీపీ నేతలే బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తాలను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రొటోకాల్ ఉల్లంఘన గానీ, యూరియా కష్టాలు గానీ లేవని గుర్తుచేశారు.

పీఎంఏవై ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

పలాస: పీఎంఏవై 2.0 ఇళ్ల కోసం పేదవారు దరఖాస్తులు చేసుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ చెన్నూరు మల్లేశ్వరరావు సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి గృహ నిర్మాణం కోసం రూ.2.5లక్షలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇస్తున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ పలకలు కూడా ఇస్తుందని చెప్పారు.

శతాబ్ది ఉత్సవం.. ఎనలేని ఉత్సాహం

- రేపటి నుంచి మూడు రోజుల పాటు కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు
- లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం



కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయం



కొత్తమ్మతల్లి అమ్మవారు

టెక్కలి: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారి శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం నుంచి గురువారం వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో పక్కాగా ఏర్పాట్లు చేశారు. జిల్లా నాయకులు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక పర్యవేక్షణలో దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనానికి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వివిధ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల్లో ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది మొట్టమొదటిసారిగా హెలికాప్టర్ రైడింగ్, అమ్మ వారి చరిత్ర తెలిపే లేజర్ షో కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలవనున్నాయి. మొదటి రోజు సంగిడి పోటీలు, 24వ తేదీన ఉలవల బస్తాలు ఎత్తే పోటీలు, అమ్మవారి శోభాయాత్ర, లేజర్ షో, 25న భారీ ఎత్తున మందుగుండు సామగ్రి కాల్పడం, శ్రీరామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర, మెగా డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నారు. వీటితో పాటు మూడు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

పిడుగుపాటుకు 4 గొర్రెలు, మేకలు మృతి



మృతిచెందిన గొర్రెలు, మేకలు

కంచిలి: మండలంలోని జె. బెల్లుపడ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో పిడుగు పడటంతో గ్రామ సమీపంలో 4 జీవాలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన గుర్రు రామారావు అనే రైతు తన జీవాలను ఎప్పటిలాగే మేతకు తీసుకెళ్లాడు. కానీ ఆదివారం పిడుగుపాటుకు గురై అతనికి చెందిన రెండు గొర్రెలు, రెండు మేకల మీద పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో ఆ రైతు లబోదిబోమంటున్నాడు. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి టి.శిరీష కళేబరాలను పరిశీలించారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి



జస్టిస్ సుబ్బారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరిస్తూ.. గోత్రనామాలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనివెట్టి మండపంలో వేదాశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలె అందజేసారు. ఈయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ప్రోటోకాల్ సిబ్బంది ఉన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ పావని

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే సుగాలి ప్రీతి కేసు విచారణకు తొలి సంతకం చేస్తానన్న హామీ ఏమైందని ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ పావని ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలో ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులపై జరుగుతున్న దాడులను, వేధింపులను అడ్డుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ సరఫరా చేయాలన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదన్నారు. అనంతరం జిల్లా గర్ల్స్ కన్వీనింగ్ కన్వీనర్‌గా పి.దివ్య, కో-కన్వీనర్‌గా నందినిలను నియమించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పి.పవిత్ర, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణారావు




నూతన కార్యవర్గం

పాతపట్నం: జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరాం రమణారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పాతపట్నం గిరిజన సామాజిక భవనంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా గురాడి అప్పన్న, సెక్రటరీగా జన్నివలస షణ్ముఖరావు, జాయింట్ సెక్రటరీ గాఎన్ని దిలిప్‌కుమార్, ట్రెజరర్‌గా జమ్ము లోకేశ్వరరావు, సలహాదారుడిగా మాణిక్యాల రావులతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు రాష్ట్ర వ్యాయామ సంఘం అధ్యక్షుడు ఎన్ని శేఖర్‌బాబు తెలిపారు. వీరిని పాతపట్నం డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొండాల చక్రపతి, పీడీలు, పీఈటీలు అభినందించారు.

నాయీ బ్రాహ్మణులను కించపరచడం తగదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నాయి బ్రాహ్మణ కులాన్ని ఎగతాళి చేసి కించపరిచేలా మాట్లాడిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొరుపూరు గజపతిరావు, ఎస్.వి.జగన్నాథం ఆదివారం డిమాండ్ చేశారు. ఇప్పటికే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగాలలో వెనుకబడి ఉన్న తమ కులాన్ని కించపరచడం భావ్యం కాదన్నారు. సమాజంలో నాయీ బ్రాహ్మణుల పాత్ర అత్యంత విలువైందని, గ్రామాలు విడిచి పట్టణ ప్రాంతానికి వలసపోయే పరిస్థితుల్ని కొందరు రాజకీయ నాయకులు అగ్రకుల దురంహకారులు తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు.

సమాజానికి వెలుగుజాడ గురజాడ



గురజాడ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సమాజ జాగృతికి వెలుగుజాడ మహాకవి గురజాడ అప్పారావు అని గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన మహాకవి గురజాడ జయంతి వేడుకలు ఆదివారం శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతి వనంలో ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు జామి భీమశంకర్, పత్తి సుమతి, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, నక్క శంకరరావు, కొమ్ము రమణమూర్తి తదితరులు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులోయ్ అని చాటి చెప్పిన గురజాడ స్ఫూర్తి సజీవంగా నిలిచి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జి.నాగేశ్వరరావు, మెట్ట అనంతం భట్లు, శాస్త్రి, సువ్వారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌లను.. వీడని గ్రహణం



కోమర్తిలో పాఠశాల ఎదురుగా అసంపూర్తిగా భవన నిర్మాణం

- ఎక్కడకక్కడ నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- పట్టించుకోని కూటమి పాలకులు

నరసన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలకు గ్రహణం పట్టింది. ఎక్కడ చూసినా అసంపూర్తి నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాలు ఉండాలనే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా భవనాలు నిర్మించేందుకు అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక్కో భవనం నిర్మించేందుకు రూ.21 లక్షలు మంజూరు చేసింది. అదే వేగంతో వీటి నిర్మాణానికి స్థలాలు సేకరణ కూడా అధికారులు పూర్తి చేశారు. భవనాలు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేపట్టారు. కొన్ని వినియోగంలోనికి వచ్చాయి. మరికొన్ని పూర్తి చేసి వినియోగంలోనికి తీసుకురావాలని అధికారులు ఆలోశిస్తున్న సమయంలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఈ భవనాలకు 'చంద్ర' గ్రహణం పట్టింది. ఎక్కడికక్కడ భవనాల నిర్మాణం నిలిచిపోయాయి. ప్రారంభమైన భవనాలు సక్రమంగా వినియోగంలో ఉండగా.. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న భవనాలు గ్రామాల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకూ వెచ్చించిన ప్రభుత్వ ధనం వృథా అవుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 594 విలేజ్ హెల్త్ క్లినిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లకు భవనాలు నిర్మాణం చేపట్టారు. భవనాలు అన్నీ ఒకేలా ఉండే విధంగా ప్రత్యేకమైన డిజైన్ రూపొందించారు. వీటిలో 175 భవనాలు నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. వివిధ దశల్లో 348 నిర్మాణంలో ఉన్నాయి. 71 చోట్ల పనులు ప్రారంభం కాలేదు. అయితే వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న భవనాల్లో అనేకం చివరి దశలో ఉన్నాయి. వీటన్నింటికి తుది మెరుగులు దిద్దితే వినియోగంలోకి వస్తాయి. అయితే ప్రభుత్వం కక్ష ధోరణితో వ్యవహరిస్తూ వీటిని పట్టించుకోవడం లేదు. దీంతో ఆయా చోట్ల విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పరాయి పంచన నిర్వహిస్తున్నారు. చాలీచాలని వసతులతో నెట్టుకొస్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అరకొర సేవలు అందుతున్నాయి. కొన్ని చోట్ల సచివాలయాల్లోనే మందులు ఉంచి వచ్చిన రోగులకు సేవలు అందిస్తున్నారు. కాగా నరసన్నపేట నియోజకవర్గంలో 74 భవనాలు మంజూరు కాగా 26 పూర్తయ్యాయి. మిగిలిన భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

పెండింగ్‌లో బిల్లులు..

మరో వైపు పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన మేరకు ఇంజినీరింగ్ సిబ్బంది బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఈ మేరకు డబ్బులు వస్తాయనే సరికి ప్రభుత్వం మారడంతో బిల్లులు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా రూ.23 కోట్లు వరకూ బిల్లులు చెల్లించాల్సి ఉందని సమాచారం. బిల్లులు చెల్లిస్తున్నామని ఇంజినీర్లు చెబుతున్నా ఆ పరిస్థితి కనిపించడం లేదు. భవనాలు పూర్తయిన వాటికి కూడా ఫైనల్ బిల్లు కాలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. చేసిన పనులకు బిల్లులు రాకోవడంతో అప్పుల పాలయ్యామని, వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కక్షధోరణి విడనాడి ఈ భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయించాలని సర్వత్రా కోరుతున్నారు. అప్పుడే గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింతగా వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని వైద్య సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.



నరసన్నపేట మండల పరిషత్ ఆవరణలో చివరి దశలో నిలిచిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం పనులు

ఉద్యోగులను మోసగిస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ సంఘ నాయకులు

శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలకు ఒక్క పైసా కూడా ప్రయోజనం కల్పించలేదని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ మండిపడ్డారు. ఆదివారం నగరంలోని దాసరి క్రాంతిభవన్‌లో కార్యవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు దనపు ఇంక్రిమెంట్లు, బోనస్‌లు అడగడం లేదని, తమకు న్యాయంగా రావలసిన ఆర్థిక ప్రయోజనాలనే సకాలంలో చెల్లించాలని కోరుతున్నారని గుర్తు చేశారు. వాటిని కూడా చెల్లించకపోవడం మోసం చేయడం కాదా?అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశంలో అధిక మొత్తంలో పెట్టుబడులను మనమే ఆకర్షిస్తున్నామని దేశంలోకెల్లా అత్యధిక వృద్ధిరేటు నమోదులో మనమే ఉన్నామని పదే పదే చెప్పుకునే ముఖ్యమంత్రి మరి ఉద్యోగులకు న్యాయంగా రావలసిన ప్రయోజనాలకు ఎందుకు గండి కొడుతున్నారో చెప్పాలన్నారు. సంక్రాంతి, దీపావళి, రెండు దసరాలు వెళ్లిపోయినా ఉద్యోగులకు మాత్రం పండగ ఆనందం లేదని, రెండు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం దసరా కానుకగానైనా ఒక డీఏ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సమర్థంగా నిర్వహించాలని కోరారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ అక్టోబర్ 7న ఫ్యాప్టో తలపెట్టిన విజయవాడ ధర్నా కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, చింతల రామారావు, బి.ఇందిర, డీవీఎస్ పట్నాయక్, సంగమేశ్వరరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తపాలా ఉద్యోగ సంఘాల మహాసభలు



మహాసభల్లో మాట్లాడుతున్న బి.శ్రీధర్‌బాబు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం డివిజన్ తపాలా ఉద్యోగ అనుబంధ సంఘాల 12వ ద్వైవార్షిక మహాసభలను యూటీఎఫ్ కార్యాలయంలో గ్రూప్-సీ అధ్యక్షులు యు.వి.రమణ, పోస్టుమేన్- ఎం.టి.ఎస్ అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్ఎఫ్‌పీఈ సంఘ నాయకులు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌పీఈ రాష్ట్ర కన్వీనర్ బి.శ్రీధర్ బాబు, పోస్టుమేన్, ఎం.టి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.మురళి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, విశాఖపట్నం పోస్టల్ రీజియన్ రాష్ట్ర నాయకులు కొండబాబు, రుద్రప్రతాప్, రామానందం, కిరణ్ కుమార్, పెంట పాపయ్య, నందికేశ్వరరావు, కస్తూరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్-సి అధ్యక్ష కార్యదర్శులుగా యు.వి.రమణ, కె.గణపతి, కోశాధికారిగా వి.డిల్లేశ్వరరావు, పోస్టుమేన్-ఎంటీఎస్ అధ్యక్ష కార్యదర్శులుగా టి.వెంకటేశ్వర్లు, ఎల్.బాబూరావు, కోశాధికారిగా ఎం.చిన్నారావు, ఇతర కార్యవర్గ నాయకులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఛాయరాజ్ రచనలు స్ఫూర్తిదాయకం



కవితా స్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఛాయరాజ్ రచనలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజాసాహిత్యాన్ని, ప్రజా కళలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రజాసాహితీ ఆధ్వర్యంలె ఛాయరాజ్ 13వ వర్ధంతి సభ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. వర్తమాన సంక్షోభాలకు పరిష్కారాలు ఛాయరాజ్ కవిత్వంలో లభిస్తాయని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి అన్నారు. ముఖ్య వక్త సయ్యద్ సాబిర్ హుస్సేన్ మాట్లాడుతూ సమాజంలో నిర్బంధ అణిచివేత, అప్రకటిత ఎమర్జెన్సీ నిత్య కృత్యంగా మారిందని, ఇటువంటి వాటిని ఛాయరాజ్ తన కవిత్వం ద్వారా నిరసించారని గుర్తు చేశారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో సామాన్య ప్రజల స్థితిగతుల కోసం చాయారాజ్ ఆవేదన చెందారని అన్నారు. కవి సనపల నారాయణమూర్తి, రచయిత అట్టాడ అప్పలనాయుడు, ప్రజాసాహితీ ఎడిటర్ పి.ఎస్. నాగరాజు మాట్లాడుతూ చాయరాజ్ ప్రజా విప్లవ కవి అన్నారు. అనంతరం అరసం ప్రచురించిన కవితా స్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చావలి శ్రీనివాస్, సదాశివ శంకరరరావు, జనసాహితీ ప్రధాన కార్యదర్శి పి.మోహనరావు, దాసరి రామ్మోహన్‌రావు, పీడీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మన్మోహన్, ఏఐటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి, వి.నవీన్‌కుమార్, రంగారావు భాగవతార్, కె.గోవిందరావు, తాండ్ర అరుణ, ఛాయరాజ్ కుటుంబసభ్యులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

శ్రీకాకుళం రూరల్: యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ రజనీ పిలుపునిచ్చారు. మునసబుపేటలోని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్సు అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురజాడ విద్యాసంస్థలు, విశ్వసాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం యువ కవితా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా కొంత సమయం కళారంగానికి కేటాయించాలన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు నాలుగు గోడల మధ్య నుంచే భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. విశ్వసాహితి కళాసమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.రమావతి మాట్లాడుతూ యువతకు నాటి, నేటి సాహిత్యాన్ని పరిచయం చేసి వారితో రచనలు చేయించి విశ్వవేదికలపై పరిచయం చేయాలన్నారు. అనంతరం గజల్ శ్రీనివాస్ తన పాటలతో యువతను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జంధ్యాల శరత్‌బాబు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి విద్యారంగ సమస్యలు



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

శ్రీకాకుళం: జిల్లాలో విద్యారంగ సమస్యలపై ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో చర్చించారు. కుప్పిలి పరీక్ష కేంద్రంపై అప్పటి డీఈఓ తిరుమల చైతన్య ఉద్దేశపూర్వకంగా ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం తెలియజేశారని, 15 మంది ఉపాధ్యాయుల సస్పెన్షన్‌కు కారణమయ్యారని పేర్కొన్నారు. సస్పెన్షన్ వెనువెంటనే ఎత్తివేసినా ఉపాధ్యాయులపై ఇంకా చార్జెస్ పెండింగ్స్ ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. ఇచ్ఛాపురం మండలం డొంకూరు, కొరిగాం హైస్కూల్ విద్యార్థులకు తాగునీటి సదుపాయం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కలెక్టర్ను కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పప్పల రాజశేఖర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బత్తుల రవికుమార్, నాయకులు వి.హరిశ్చంద్రుడు జి.సిగడాం మండల శాఖ అధ్యక్షుడు లాడే చంద్రశేఖరరావు, లావేరు మండల శాఖ అధ్యక్షుడు మెండ నీలం కుమార్, భామిని మండల శాఖ ప్రతినిధి ముద్దాడ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ క్రికెటర్ నురేన్ హక్ మృతికి సంతాపం



మహమ్మద్ నురేన్ హక్(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరానికి చెందిన సీనియర్ మాజీ వెటరన్ క్రికెటర్ మహమ్మద్ నురేన్ హక్ ఆదివారం బెంగళూరులోని ఓ హాస్పటల్‌లో తుదిశ్వాస విడిచారు. చంపాగల్లి వీధికి చెందిన నురేన్ హక్ పాతతరం క్రికెటర్లలో ఆల్‌రౌండర్‌గా గుర్తింపు పొందారు. నార్త్‌జోన్, జోనల్ స్థాయి వరకు ప్రాతినిధ్యం వహించారు. 1994 నుంచి 1999 వరకు జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీగా వ్యవహరించారు. ఈయన మృతిపట్ల మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు పీవైఎస్ శాస్త్రి, హజన్‌రాజా షేక్, మెంటార్ ఇలియాస్ అహ్మద్, కోశాధికారి మదీనా శైలానీ, కౌన్సెలర్ డాక్టర్ ఎస్.రవికుమార్, ఆర్సీరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కూలిన గోడ.. తప్పిన ప్రమాదం



నందవ గ్రామంలో కూలిన మట్టిగోడ

మెళియాపుట్టి: పరశురాంపురం పంచాయతీ నందవ గ్రామంలో సవర చిన్నలక్ష్మయ్య ఇంటి మట్టిగోడ కూలిపోయింది. ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి గోడ తడిసి పోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో కుటుంబసభ్యులంతా అదే ఇంట్లోఉన్నారు. గోడ బయటవైపు పడిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అధికారులు పరిశీలించి సాయం అందించాలని బాధితుడు కోరారు.

థర్మల్ వ్యతిరేక పోరాటానికి

వైఎస్సార్‌సీపీ మద్దతు



పత్రాలు చూపిస్తున్న పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

- దేశమంతా వ్యతిరేకిస్తుంటే ఆమదాలవలసలో ఎందుకు?
- సీఎం సొంత నియోజకవర్గంలో ఏర్పాటు చేసుకోవచ్చుకదా..
- విలేకరుల సమావేశంలో పార్టీ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించనున్న థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాల్లో 2030 నాటికి 50 శాతం థర్మల్ పవర్ ప్రాజెక్టులను మూసివేస్తామని, 2050 నాటికి పూర్తిస్థాయిలో ప్రాజెక్టులను మూసివేస్తామని తీర్మానం చేశాయని గుర్తు చేశారు. ఈ తరుణంలో రాష్ట్రంలో శివారు జిల్లా శ్రీకాకుళంలో రూ.30 వేల కోట్లతో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తామని సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడడం విడ్డూరంగా ఉన్నారు. అవసరమైతే సీఎం సొంత నియోజకవర్గంలో ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. థర్మల్ ప్లాంట్ ఏర్పాటుతో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, ఎల్ఎన్‌పేట, హిరమండలం, సీతంపేట, పాలకొండ, సంతకవిటి, శ్రీకాకుళం రూరల్‌తో కలిపి తొమ్మిది మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. ప్రజల శ్రేయస్సు, భావి తరాల మనుగడ దృష్ట్యా ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రాణత్యాగాలకైనా సిద్ధమని ప్రకటించారు. గతంలో జెన్కో పేరుతో భూములు సేకరించి విశాఖపట్నంలో హిందూజా కంపెనీకి, రాజమండ్రి వద్ద జీవీకే కంపెనీకి కారుచౌకగా భూములు కట్టబెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు.

- వెన్నెలవలస థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో అక్కడ సేకరించిన భూములు, ప్లాంట్ నుంచి వచ్చే బూడిదతో వ్యాపారం చేసి వాటిని కాజేయడానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ ముందస్తు ప్రణాళిక చేస్తున్నారని ఆరోపించారు. వెన్నెవలసలో కూన రవి పేరిట 50 ఎకరాలు, ఆయన సతీమణి పేరిట 50 ఎకరాలు 10 ఏళ్ల లీజుకు తీసుకునేందుకు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారని, ఆ స్థలంలో కూనవారిపూలతోట పేరుతో తోటలు పెంపకం చేసేందుకు సిద్ధమయ్యారని గుర్తుచేశారు. అప్పుడే ఆ భూములపై కూన రవికుమార్ కన్ను పడిందన్నారు. ఇపుడు పవర్ ప్లాంట్ పేరుతో మళ్లీ ఆ భూములు నొక్కేసేందుకు, ప్లాంట్ తయారైతే దాని నుంచి వచ్చే బూడిదతో సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు.
- థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాలుగు టీఎంసీల నీరు అవసరమని, అదే నాలుగు టీఎంసీల నీటితో 50వేల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేయవచ్చని తెలిపారు. ప్లాంట్ పేరుతో ఆ ప్రాంతంలో గిరిజనులకు బతుకు తెరువు లేకుండా చేయడం సమంజసంకాదన్నారు. అనంతరం ప్లాంట్ ముప్పుకు సంబంధించిన అన్ని పత్రాలను విడుదల చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, ఆమదాలవలస పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులు దుంపల శ్యామలరావు, గురుగుబెల్లి శ్రీనివాసరావు, కూన రామకృష్ణ, దన్నాన అజయ్‌కుమార్, మామిడి రమేష్, చిగురుపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఐదుగురు అరెస్టు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

పలాస: మూడు కేసుల్లో ఒడిశా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు గంజాయితో పట్టుబడినట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గొయిబంద గ్రామానికి చెందిన జిసియా గుంట, అతని భార్య స్వప్నబిబార్‌లు గుణుపూర్ నుంచి 40.240 కిలోల గంజాయిని రెండు ట్రాలీ బ్యాగుల్లో పట్టుకొని బస్సులో బయలుదేరి పలాసలో దిగారు. అక్కడి నుంచి నడుచుకుంటూ పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. అలాగే తమిళనాడు రాష్ట్రం విజయరాఘవపురం గ్రామానికి చెందిన గాయిత్రి అనిఫ్, సుభాస్(అన్నా చెల్లెళ్లు) ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి పలాస బస్సులో వచ్చి రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 28.860 కిలోల గంజాయి, సెల్‌ఫోన్, రూ.540 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో ఒడిశా రాష్ట్రం కంటసారు గ్రామానికి చెందిన లలిత మజిహి, సంజయ్ కుమార్ సాహులు బరంపురం నుంచి బస్సులో పలాస వచ్చారు. అక్కడి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 15.715 కిలోల గంజాయి, సెల్‌ఫోన్, రూ.470లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నర్సింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

మందస: కొర్రాయి గేటు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి వయసు 55 ఏళ్లు దాటి ఉంటాయని, ప్రమాదానికి గురైన వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టి.. లారీ కిందకు దూసుకెళ్లి..

- జాతీయ రహదారిపై అదుపు తప్పిన కారు
- ముగ్గురికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో నుజ్జయిన వాహనాలు

నరసన్నపేట : దేవాది కూడలి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. నరసన్నపేట వైపు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి ముందున్న ద్విచక్ర వాహనాన్ని తోసుకుంటూ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం లారీ కిందకు వెళ్లి నుజ్జు కాగా.. కారు ముందు భాగం సైతం లారీ కిందకు దూసుకుపోయింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న తలసముద్రం గ్రామానికి చెందిన శ్రీను, వెనుక కూర్చుకున్న సంతోషిలకు తీవ్ర గాయాలయ్యాయి. సంతోషి పరిస్థితి విషమంగా ఉంది. కారు కిష్టుపురం నుంచి వస్తుండగా డ్రైవింగ్ సీట్లో దుర్గారావు ఉన్నారు. ఈయనకు స్వల్ప గాయాలయ్యాయి. కారు డ్రైవర్ నిద్ర మత్తే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. క్షతగాత్రులను ఎన్‌హెచ్ అంబులెన్స్, 108 వాహనాల్లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియామకాల్లో నిబంధనల ఉల్లంఘన తగదు

శ్రీకాకుళం : జిల్లాలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారుల నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా జరగడాన్ని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఖండించారు. ఈ మేరకు ఆదివారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అధ్యక్షతన జిల్లా కార్యవర్గంతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ అభివృద్ధి అధికారి నియామకంలో నిబంధనలు పాటించకుండా డిప్యుటేషన్ ప్రాతిపదికన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మహిళ ఉపాధ్యాయురాలిని నియమించడాన్ని తప్పుపట్టారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసి రాత పరీక్ష నిర్వహించి ఇంటర్వ్యూ ద్వారా నియామకం చేయకుండా రాజకీయ సిఫారసుల మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అడ్డదారిన నియామకం చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే అక్రమ డిప్యుటేషన్ రద్దు చేసి సమగ్ర శిక్షలో సెక్టోరియల్ అధికారుల ఖాళీలను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు హరిప్రసన్న మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటైన ఫౌండేషన్ పాఠశాలలు, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్, జి.బాలకృష్ణ, గణేష్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు కొమ్ము అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.